క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా శ్రీనివాస్‌రెడ్డి



దామెర : స్థానిక ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా శ్రీనివాస్‌రెడ్డి సోమవారం పూర్తి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆత్మకూరు ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన స్థానిక ఎంపీడీఓగా పని చేసిన ఎం.వెంకటేశ్వర్‌రావు డిప్యూటేషన్‌పై సంగెంకు వెళ్లడంతో ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాస్‌రెడ్డికి ఎంపీపీ కాగితాల శంకర్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, దళితబంధు మండల చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, ఏపీఓ శారద, సీనియర్ అసిస్టెంట్ విష్ణు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జక్కుల అనిత కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, ఎంపీఓ నాగరాజు, ఏపీఓ కుమారస్వామి, ఏఈ రాజమల్లారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాజిరెడ్డి, సర్పంచ్ కొమురయ్య, చంద్రకళ, అనిత పాల్గొన్నారు.

మూడు మొరం టిప్పర్ల స్వాధీనం



ఐనవోలు : అక్రమంగా మొరం తరలిస్తున్న మూడు టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై గుగులోతు వెంకన్న కథనం ప్రకారం.. మండలంలోని కొండపర్తి గ్రామ శివారు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. మూడు టిప్పర్లు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహన యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా మొరం తరలిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధిత రైతులకు పరిహారం చెల్లించాలి

శాయంపేట : మండలంలో ఇటీవల కురిసిన ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు త్వరగా పరిహారం చెల్లించి ఆదుకోవాలని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి వంగరి సాంబయ్య సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అకాల వర్షాలకు రైతులు భారీగా నష్టపోయారని పేర్కొన్నారు. రోజులు గడుస్తున్నా సంబంధిత శాఖల అధికారులు, ప్రభుత్వం నష్టంపై స్పందించడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం సర్వే చేయించి ఎకరానికి రూ.40 వేలు చొప్పున బాధిత రైతులకు పరిహారం అందించాలని సూచించారు.

రోడ్డు పనుల్లో వేగం పెంచాలి

శాయంపేట : శాయంపేట–ఆత్మకూరు మండలాల మధ్య నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ ప్రభుత్వాన్ని, అధికారులను సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఆ మండలాల మధ్య చేపట్టిన రోడ్డు పనులు మండల కేంద్రంలో నిలిచిపోయి ఏండ్లు గడుస్తున్నా పూర్తి చేయడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. రోడ్డు పనులు పూర్తి చేసేలా, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

నేడు భద్రకాళి, భద్రీశ్వరుల కల్యాణం

వరంగల్ చౌరస్తా: బ్రహోత్సవాల్లో భాగంగా నేడు భద్రకాళి, భద్రీశ్వరుల కల్యాణం జరుగుతుందని కార్పొరేటర్ గందె కల్పన, నవీన్‌కుమార్ తెలిపారు. వరంగల్ పిన్నావారి వీధిలో కల్యాణ మహోత్సవ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. గ్రేటర్ వరంగల్ ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఉదయం 9గంటల నుంచి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అభిషేకాలు, కంకుమార్చాన పూజలు, పల్లకీ సేవ, అన్నప్రసాద వితరణ, సాయంత్రం గజవాహన సేవ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బుద్ధ జగన్, నవీన్, ప్రతినిధులు నమఃశివాయ, రాము, అరవింద్, కార్యక్రమ కన్వీనర్ దాచేపల్లి సీతారాం పాల్గొన్నారు.

నేటి ప్లీనరీని విజయవంతం చేయండి

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి రమేష్



ఐనవోలు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్

ఐనవోలు : 23వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్ధన్నపేటలోని లక్ష్మీ గార్డెన్‌లో నేడు (మంగళవారం) నిర్వహించనున్న బీఆర్‌ఎస్ ప్లీనరీని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ కోరారు. మండల కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వరాష్ట్ర సాధనే ఏకైక ఎజెండాగా, తెలంగాణ ఆత్మగౌరవ నినాదంగా 2001లో కేసీఆర్ నాయకత్వంలో పార్టీ అవతరించిందని గుర్తు చేశారు. స్వరాష్ట్రాన్ని సాధించిన తర్వాత బంగారు తెలంగాణ దిశగా అడుగులు వేసినట్టు తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలే కాకుండా ఎవరూ అడగకున్నా కల్యాణలక్ష్మీ, రైతుబంధు లాంటి అనేక పథకాలు తీసుకొచ్చి అన్ని వర్గాల పేదలను ఆదుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రాన్ని దేశంలో నెంబర్ వన్ స్థానంలో నిలిపినట్టు వివరించారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణాల్లో, పల్లెల్లో పార్టీ పతాకాన్ని పండుగ వాతావరణంలో ఉదయం 8 గంటలకు ఆవిష్కరించాలని సూచించారు. ప్లీనరీలో 13 అంశాలపై తీర్మాణాలు ఆమోదిస్తామని, నియోజకవర్గ అభివృద్ధిపై తన ప్రసంగంతో సభ ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షురాలు ఎల్లావుల లలిత యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ పాల్గొన్నారు.

నేడు ఆవిర్భావ వేడుకలు : చల్లా



ఆత్మకూరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : నేడు (మంగళవారం) పరకాలలో బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నట్టు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. హనుమకొండలోని ఆయన నివాసంలో పార్టీ ముఖ్యనాయకులతో సోమవారం ఆయన సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పరకాల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నేడు ఉదయం 8 గంటలకే పార్టీ జెండాలను ఆవిష్కరించాలని, ర్యాలీగా బయల్దేరి ఉదయం 10 గంటల వరకు సమావేశ ప్రాంగణానికి రావాలని తెలిపారు. ఆయా మండలాల రిజిస్ట్రేషన్ కౌంటర్లలో నమోదు చేసుకోవాలని చెప్పారు. ఆవిర్భావ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రెడ్‌క్రాస్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, ఆత్మకూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు లేతాకుల సంజీవరెడ్డి, బొల్లోజు కుమారస్వామి, దామెర మండల అధ్యక్షుడు గండు రాము, దామెర వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఎన్కతాల్ల రవీందర్ పాల్గొన్నారు.

గురుకులాల్లో నాణ్యమైన విద్య



సీటు పొందిన విద్యార్థిని అభినందిస్తున్న శ్రీపాల

దామెర : మైనార్టీ గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని మైనార్టీ గురుకుల పాఠశాలల సంస్థ రీజినల్ లెవల్ కోఆర్డినేటర్ (ఆర్‌ఎల్‌సీ) శ్రీపాల తెలిపారు. మండలంలోని ఓగ్లాపూర్ గ్రామ సమీపంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో నాన్ మైనార్టీ విభాగంలో దరఖాస్తు చేసుకున్న 20 మంది విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో లక్కీడిప్ ద్వారా సోమవారం అడ్మిషన్లు ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీపాల మాట్లాడారు. ప్రభుత్వం మైనార్టీ గురుకులాల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధనతోపాటు ఇతర సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. అర్హులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం సీటు పొందిన విద్యార్థులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.శ్రీలత, అకాడమిక్ కోఆర్డినేటర్ రుహీన పాల్గొన్నారు.

అధికారంలోకి రావడం ఖాయం

- మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి

పరకాల : కేంద్రంలోనే కాకుండా రాష్ట్రంలోనూ రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ ఆలేరు పాలక్, పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి తెలిపారు. ఈనెల 28న దేశ ప్రధాని నరేంద్ర మోడీ 'మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్'ను పరకాల నియోజకవర్గంలో విజయవంతం చేసేందుకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో భిక్షపతి మాట్లాడారు. పరకాల నియోజకవర్గంలో పార్టీని గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని సూచించారు. శ్రేణులు ప్రజలతో మమేకం కావాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి చైతన్యవంతం చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న తప్పుడు విధానాలతో ప్రజలు విరక్తి చెంది ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, హుస్నాబాద్ పాలక్ డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జ సత్యనారాయణరావు, కాచం గురుప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ.జయంత్‌లాల్, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

'అమిత్‌షా వ్యాఖ్యలు సరికాదు'

ఆత్మకూరు : కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ముస్లింల పట్ల చేసిన వ్యాఖ్యలు సరికాదని టీకేఎస్‌ఎస్ (తురక కాశ సంక్షేమ సంఘం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ వలీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమిత్‌షా వ్యాఖ్యలు మైనార్టీల్లో అభద్రతాభావం పెంపొందించేలా ఉన్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ఎన్నికల్లో ముస్లింల ఓట్లతో బీజేపీ అధికారంలోకి రాలేదా అని ప్రశ్నించారు.

అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర, శివ మార్కండేయ ఆలయ సముదాయాల్లో నిర్వహిస్తున్న దశమ వార్షిక బ్రహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉత్సవాలను హనుమకొండలోని భద్రకాళీ ఆలయ ప్రధాన అర్చకుడు శేషు శిష్యులు గుమ్మడవెల్లి గణేష్ ఆత్రేయ శర్మ, వడ్లకొండ శివకుమార్ శర్మ, తూర్లపాటి సాయిచరణ్ శర్మ, ఖమ్మంవెట్టు సంతోష్‌శర్మ, పర్చా సాయికృష్ణ, ప్రసాద శర్మ, దెబ్బట రామానుజాచార్య, దుర్గాసాయి శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య గణపతి పూజ, పుణ్యాహవచనం, ఋత్విగ్వరణం, అగ్నిస్థాపన, బెరీతాడనం, ధ్వజారోహణం, మండల దేవతాపూజనం, ఎదుర్కోలు కార్యక్రమాలను వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ, ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్ సహా పలువురు ప్రముఖులు కుటుంబాలతో సహా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్, అఖిల భారత పద్మశాలి సంఘం మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు బాసాని పద్మ, విశ్రాంత ఉపాధ్యాయుడు వనం సదానందం, ప్రముఖులు బాసాని చంద్రమౌళి, బాల్నె తిలక్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య



ప్రోగ్రెస్ రిపోర్ట్ అందజేస్తున్న హెచ్‌ఎం లింగారావు, సర్పంచ్ ఆరోగ్యం

ఐనవోలు : ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య అందుతోందని మండలంలోని ఉడుతగూడెం గ్రామంలోని మండల ప్రజాపరిషత్ సెకండరీ (ఎంపీపీఎస్) స్కూల్ హెడ్‌మాస్టర్ చుంచుకాల లింగారావు తెలిపారు. ఆ పాఠశాలలో సోమవారం నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ మీట్ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రోగ్రాం గురించి వివరించారు. ఈనెలలో నిర్వహించిన ఎస్‌ఏ-2 మార్కులు తెలియజేశారు. విద్యార్థుల ఆన్‌లైన్ ప్రోగ్రెస్ రిపోర్టులు పంపిణీ చేశారు. సర్పంచ్ బరిగెల ఆరోగ్యం మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అలాగే పిల్లలను సరైన దిశలో నడిపించడంలో తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. పేరెంట్స్, టీచర్ మీట్ సందర్భంగా పిల్లల్లో ఉన్న సామర్థ్యలు, లోపాలపై చర్చించి సరైన ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. తద్వారా విద్యార్థులు చదువుల్లోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దవచ్చని స్పష్టం చేశారు. రానున్న విద్యాసంవత్సరంలో పాఠశాలలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో చేరేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ప్రతికంఠం ఉమాదేవి, గ్రామ పంచాయతీ కార్యదర్శి దీపిక, విద్యార్థుల తల్లిదండ్రులు బరిగెల రాధిక, సమత, ప్రణీత, రాజిరెడ్డి, మమత, రజిత, అనిత, భారతి, ప్రియాంక, బిందు, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో రైతులకు లబ్ధి



నడికూడ : ప్రారంభిస్తున్న చైర్మన్ సారంగపాణి



ఎల్కతుర్తి : ప్రారంభిస్తున్న ఎంపీపీ మేకల స్వప్న



కమలాపూర్ : ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కల్యాణి

నడికూడ : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలతో రైతులకు లబ్ధి చేకూరుతుందని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండి సారంగపాణి తెలిపారు. మండలంలోని నార్లాపూర్, చౌటుపర్తి, నడికూడ, రాయపర్తి, రామకృష్ణాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ మచ్చ అనసూర్య, జెడ్పీటీసీ కోడెపాక సుమలతలతో కలిసి సారంగపాణి సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం రైతులు పండించిన పంటకు సరైన ధర కల్పించే దిశగా, దళారీల నుంచి రైతులను కాపాడేలా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా కోఆర్డినేటర్ భిక్షపతి, సర్పంచ్‌లు కృష్ణమూర్తి, పెండ్లి రాజు, తిప్పర్తి సాంబశివరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్శెట్టి చంద్రమౌళి, నాయకులు గణపతిరెడ్డి, జైపాల్‌రెడ్డి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మండలంలోని ఎల్కతుర్తి, కోతులనడుమ, దండేపల్లి, చింతలపల్లి, దామెర గ్రామాలో ఐకేపీ, విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ మేకల స్వప్న, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్ ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో 'ఏ' గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2,060, కామన్ రకాలకు రూ.2,040 చెల్లిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కడారి రాజు, సర్పంచ్ కొమ్మిడి నిరంజన్‌రెడ్డి, ఏఓ రాజ్‌కుమార్, ఏపీఎం రవీందర్, సీసీ రవీందర్, సీఏ కవిత. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడిశాల సమ్మయ్యగౌడ్, నాయకులు గొల్లె మహేందర్, తంగెడ మహేందర్, రవీందర్‌రెడ్డి, సూరయ్య పాల్గొన్నారు.

కమలాపూర్ : మండలంలోని గుండేడు, శనిగరం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జెడ్పీటీసీ లాండిగె కల్యాణి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ తడక రాణి శ్రీకాంత్ ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు లక్ష్మణ్‌రావు, పింగిలి రవళి రంజిత్‌రెడ్డి, తహసీల్దార్ రాణి, ఏఓ లక్ష్మారెడ్డి, డీపీఎం ప్రకాష్, ఏపీఎం నారాయణ పాల్గొన్నారు.

డీలర్ల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



మాట్లాడుతున్న సామల మల్లయ్య

శాయంపేట : రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు సామల మల్లయ్య విమర్శించారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ డీలర్లు సరైన ఆదాయం లభించక, దుకాణాల అద్దె సైతం చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న కమీషన్‌ను సైతం రాష్ట్ర ప్రభుత్వం డీలర్లకు సకాలంలో అందించడం లేదన్నారు. డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న హనుమకొండలో గౌరవ వేతన సాధన సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. హక్కుల సాధన కోసం రేషన్ డీలర్ల రాష్ట్ర జేఏసీ జూన్ నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని డీలర్లను సమాయాత్తం చేసే దిశలో ఈనెల 25న హనుమకొండలో తలపెట్టిన సభకు డీలర్లు కుటుంబాలతో సహా హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు, స్థానిక డీలర్లు అమ్మ అశోక్, కుసుమ మల్లయ్య, కంబత్తుల ప్రకాశం, చరణ్, శంకర్ పాల్గొన్నారు.

'108' అంబులెన్స్ అందించడంలో విఫలం

శాయంపేట : మండలానికి 108 అంబులెన్స్‌ను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు మారపల్లి సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాదాల బారిన పడ్డ, ఇతర సందర్భాల్లో ఆస్పత్రులకు వెళ్లాల్సిన వారిని ప్రైవేట్ వాహనాల్లో తరలించాల్సి వస్తోందని తెలిపారు. 108 వాహనం లేకపోవడం వల్ల రోగులకు, క్షతగాత్రులకు సరైన సమయంలో వైద్యం అందని దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని, జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతిని పలుమార్లు కలిసి వినతిపత్రాలు అందించినా పట్టించుకోలేదన్నారు. ఇకనైనా 108 అంబులెన్స్‌ను అందించాలని కోరారు. సమావేశంలో నాయకులు రవికిరణ్, వెంకన్న పాల్గొన్నారు.

నేడు సన్మానం

హన్మకొండ కల్చరల్: ఆదిశంకరులు, రామానుజుల జయంతిని పురస్కరించుకుని అద్వైత పండితుడు గంగు ఉపేంద్ర శర్మ, విశిష్టాద్వైత పండితుడు చెరుకుపల్లి శ్రీనివాసాచార్యులను సన్మానించనున్నట్లు ధన్వంతరి సేవా సమితి అధ్యక్షుడు, కృష్ణ యజుర్వేద పండితుడు విజయకుమారాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శంకర్

దామెర : రైతు సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ కాగితాల శంకర్ తెలిపారు. మండలంలోని పసరగొండ గ్రామంలో గతేడాది అకాల వర్షానికి మిర్చి పంట నష్టపోయిన రైతులకు మంజూరైన పరిహారం చెక్కులను సోమవారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలిచేందుకు రైతుబంధు, తదితర అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఇటీవల కురిసిన అకాల వడగండ్ల వానకు మండలంలో భారీగా పంటల నష్టం జరిగిందని చెప్పారు. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. అధికారులతో సర్వే చేయించి త్వరలోనే బాధిత రైతులందరికీ ఎకరానికి రూ.10 వేలు చొప్పున ప్రభుత్వం పరిహారం మంజూరు చేయనుందని తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి (ఏఓ) శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, సర్పంచ్ మేడిపల్లి సాంబయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ గజ్జి విష్ణు, దళితబంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, ఏఈఓ పవన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడమే లక్ష్యం

- బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఫౌండర్ దేవేందర్



విద్యార్థులతో దేవేందర్, రవికుమార్

ఐనవోలు : పేదలకు సేవలు అందించడమే లక్ష్యంగా బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ముందుకు సాగుతోందని ఫౌండర్ పులి దేవేందర్ తెలిపారు. ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పంథిని గ్రామంలోని జెడ్పీ స్కూల్‌లో విద్యార్థులకు ఉచితంగా పోటీ పరీక్షల పుస్తకాలను సోమవారం ఆయన అందించి మాట్లాడారు. పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు సిద్ధమౌతున్న పేద విద్యార్థులకు ఉపాధ్యాయుడు, ఫౌండేషన్ సభ్యుడు కోల రవికుమార్ ద్వారా పోటీ పరీక్ష పుస్తకాలు అందించినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఫౌండేషన్ సభ్యులున్నారని, సేవలు విస్తరిస్తున్నామని చెప్పారు. విద్యతోనే మెరుగైన సమాజ నిర్మాణం సాధ్యమన్నారు. భవిష్యత్తులో పేద విద్యార్థుల కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభ చాటి పాఠశాల, తల్లిదండ్రుల కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ, ప్రమీల, అన్నపూర్ణ, నిర్మల, మాధురిరెడ్డి, వెంకట్‌రెడ్డి, సుధాకర్, వెంకట నర్సింహాచారి, రాజమణి, ప్రేమ్ ప్రసాద్, జైరాం పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: వరంగల్ అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని కీర్తి బార్ వద్ద నీటి వృథాను అరికట్టేందుకు పైపులైన్‌కు మరమ్మతులు కొనసాగుతున్న క్రమంలో పలు ప్రాంతాలకు మంగళవారం నీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ రామోజు శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరీమాబాద్ 32, 33, 39 డివిజన్లలోని ప్రాంతాలైన భగత్‌నగర్, జ్యోతినగర్, కీర్తి బార్ వెనుక వైపు ప్రాంతాలైన మేదరివాడ, పెరుకవాడ, శాంతినగర్, లక్ష్మీనగర్, ఎస్‌ఆర్‌ఆర్‌తోట ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు.

'దళితబంధు' వర్తింపజేయాలి



అభివాదం తెలుపుతున్న ఫెడరేషన్ ప్రతినిధులు

దామెర : దళిత సామాజికవర్గానికి చెందిన జర్నలిస్టులందరికీ దళితబంధు పథకాన్ని వర్తింపజేయాలని మీడియా అకాడమీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎంఏఎఫ్ఐ) జాతీయ చైర్మన్ ఇనంపెల్లి వేణు, హైకోర్టు అడ్వకేట్ మేడ శ్రీనివాస్, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ వి.సదానందరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని దుర్గంపేట్ సమీపంలోని ఎస్‌ఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు అపరాతి నాంపెల్లి యాదవ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన జర్నలిస్టుల ప్రథమ మహాసభలో పలు తీర్మానాలు చేశారు. అనంతరం వేణు, శ్రీనివాస్, సదానందరెడ్డి మాట్లాడారు. సమావేశంలో నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ బింగి సుధాకర్, మహిళా విభాగం అధ్యక్షురాలు జన్ను ప్రమీల, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ తాళ్లపెల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవ అలవర్చుకోవాలి

హన్మకొండ: సమాజంలోని ప్రతి ఒక్కరూ సామాజిక సేవలను అలవర్చుకోవాలని జనగామ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రాంరెడ్డి, హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ మీడియా ఆఫీసర్ అశోక్‌రెడ్డి సూచించారు. హనుమకొండ గోపాల్‌పూర్‌లోని భువనేశ్వరి ఫంక్షన్ హాల్‌లో ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు మోత్కూరి రాము అధ్యక్షతన భువనేశ్వరి చారిటబుల్ ట్రస్టు సమావేశం ఆదివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా రాంరెడ్డి, అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సేవే లక్ష్యంగా ముగ్గురు వ్యక్తులు ముందుకు వచ్చి చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ సందర్భంగా అరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ కుటుంబానికి, పేద విద్యార్థి హాస్టల్ ఫీజుకు విరాళం అందించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రధాన కార్యదర్శి చప్పిడి పద్మజ, కోశాధికారి గుండవరం విధుమౌళి, అతిథులు హరిగోపాల్ శర్మ, వద్దిరాజు దీపక్, బ్రహ్మణపల్లి మధుశర్మ, దేవులపల్లి వాణి, అప్పాల రవీందర్, అంబటి నర్సయ్య, జనార్దన్ రెడ్డి, శ్యాంసుందర్ రావు, సారంగచారి పాల్గొన్నారు.